గర్హింపవలసి యున్నది. ప్రస్తుతపు చక్కెర కొరతకు బాధ్యత దీనిదే అని చెప్పవచ్చును. ఎక్కువ ధరలకొరకై కొన్ని సమయములందు ఉత్పత్తిని తగ్గించుటకు దీనికి పరిపాటి యైనది.

'సౌత్ యిండియన్ షుగర్ మిల్సు అసోసియేషన్' తమ అదుపులో నున్న ప్రదేశమును ప్రాంతీయముగా విభజించి,ఒక్కొక్క ఫ్యాక్టరీకి కేటాయించినది. ఈ విధముగా 'ప్రాంతీయ ఆధిపత్యమును చలాయించుట జరుగుచున్నది.

ఇట్టి నిరంకుశ విధానమును నిర్మూలించుటకు సమష్టి అమ్మకపు సంస్థ ఎంతో ఉపయోగకరముగా నుండునని సూచింపబడినది. కాని ఫ్యాక్టరీలకు దీనిలో సభ్యత్వము తప్పనిసరి. దేశమునకంతకు పంపిణీ యీ సంస్థ ద్వారానే జరుగవలెను. దీనినిబట్టి జూచిన పేరులో మార్పుతప్ప 'సిండికేటు'కు దీనికి యే మాత్రము భేదము లేదని వేరే చెప్పనక్కరలేదు.

కాగా ప్రస్తుతపు సమస్యను సాధించుటకు రెండే రెండు మార్గము లున్నవి. పరిశ్రమను జాతీయము జేయుట మొదటి మార్గము. ఇట్టి చర్య అత్యావశ్యక మయినప్పటికి ప్రస్తుత పరిస్థితులలో అనుసరణీయముకాదు. ఎంత పరిహార మివ్వవలయును, ఎట్లు యివ్వవలయును, అను ప్రశ్నలు రాకమానవు. పైగా దేశపు ఆర్థికసౌష్ఠవము యిట్టిచర్యకు దోహదము కల్పించుట లేదు.

'షుగరు సిండికేటును' వెంటనే నిర్మూలించి, పరిశ్రమకు రక్షణను 1950 మార్చి తరువాత తొలగించుట రెండవ మార్గము. ఇదిచాలా సమంజసముగా కూడా నుండును.

కుట్ర

# నయనం ప్రధానం

(కథానిక)

అవసరాల రామకృష్ణారావు

ఏదో పిలవక పిలవక పిలిచారు, పండుగ, బాగుండదని వెళ్లేడేగాని, యింత అవహాస్యం అవమానం జరుగుతాయని తెలిస్తే నరసింహం అత్తగారి గుమ్మమే తొక్కకపోను! వెధవ కళ్లజోడు, మూడేళ్లనుంచీ రాయిలా వున్నది, అంతలోనే జారి ముక్కలవాలా? పోనీ ఆ విరిగింది పండుగంతా అయినతరువాతైనా విరగకూడదూ? పోనీ విరిగిందయ్యా, లక్షణంగా భార్య కామాక్షిని పిలిచి 'ఏమే, యిలా కళ్లజోడు విరిగింది, ఇది లేకపోతే నాకు కళ్ళున్నా లేనట్టే, కాస్త నలుగురిలోనూ ఎలాగో చూస్తూండు సుమా!" అన్నా బాగుండును. బావమరిది శేషగిరి వచ్చి 'ఏం బావా, నీ కళ్లజోడు విరిగిందా, అయ్యో పాపం! యిక నీకు సరిగ్గా కనపడదు కాబోలు' అన్నప్పుడు ఊరుకున్నా బాగుణ్ణు. పై పెచ్చు 'అబ్బే, ఆ కళ్లజోడు సరదాకే పెట్టేనోయ్ అది లేకపోయినా బాధలేదు' అనడమెందుకు?నిజంగా అమ్మాటకొస్తే కళ్లజోడు విలాసానికి పెట్టినమాట నిజమే. కాని ఆ విలాసమే అలవాటై, గ్రహపాటై అంధత్వం ప్రసాదించి 'నే లేకపోతే నీకు క్షణం గడవదు' అన్నట్టు చేసిందే! ఇంత చదువు చదివినవాడూ ఆ పల్లెటూరి రైతుల హాస్యానికి గురై ... ఛీ ... ఎందుకొచ్చిన జన్మ? తనదగ్గిర డబ్బూ వుంది; డాక్ట రిచ్చిన సైట్ ప్రిస్క్రిప్షనూ వుంది. అయితేనేం, ఆ వెధవ వూళ్లో కొట్లేవీ? పోనీ మామగారితో 'అయ్యా యిలా కళ్లజోడు విరిగింది. నాకు తలనొప్పి వస్తుంది' అని ఏదో వంక పెట్టుకుని వెంటనే రైలెక్కినా బాగుణ్ణు! అన్నీ మనసులో అనుకున్నమాట నిజమే. పైకి ఓమాటా అనడానికి మొహమాటం! వెధవ మొహమాటం. అదే కొంప తీసింది.

వెధవ, 'కా' గుణింతమేనా సరిగ్గా రాని చిన్నబావమరది, సుబ్బిగాడు, రెండువేళ్లూ పైకి చూపిస్తూ 'బావా, యివెన్ని వేళ్లు?' అన్నాడు. నిజానికి అవెన్నో నరసింహానికి కనిపించని మాట నిజమే- అలా అని ఊరుకున్నా బాగుణ్ణు. మహా గొప్పగా "మూడు!" అన్నాడు. సుబ్బిగాడు

ఘొల్లున నవ్వుతే, 'తమాషాకన్నానోయ్, నువ్వు చూపించినవి ఐదు వేళ్ళు కాదూ?' అన్నాడు!

మామూలుగా రోజూ పొద్దున కామాక్షి, నిద్రలేపడం మామూలు. ఆవాళ అతని అదృష్టం కొద్దీ మరదలు నీతే లేపాలా? ఆ అమ్మాయే నా మెల్లిగా వచ్చి, తమాషాకి బావవీపుమీద ఓచిన్న చరుపు చరిచింది. నరసింహం పెళ్లామే అనుకొని, 'అబ్బ ఏమిటే పెధవ వేళాకోళం నువ్వూను" అన్నాడు. ఆ పిల్ల కాణీ అంత మొహం చేసుకొని నిష్క్రమించింది. మరో గడియకు పెళ్లాం వచ్చి 'అంతలా కసరాలా చెప్పండి? చిన్నపిల్లలు-' నరసింహం మధ్యలో అందుకుని, అవచ్చింది శేషగిరి అనుకొని, 'మీ తమ్ముడంటే, నీకభిమానం ఉండొచ్చును గాని, అంతలా చరుస్తాడా?' అన్నాడు. కామాక్షి నవ్వాపుకొని 'సంతోషించాం కాని ముందు దొడ్లోకి వెళ్లి రండి, తలంటుకుందురుగాని' అంది. నరసింహం దొడ్లోకి వెళ్లబోయి నీళ్లగది చేరుకున్నాడు. ఆ వేళకి అతని వదినగారు పార్వతి స్నానం చేస్తోంది! పార్వతి గతుక్కుమని 'అదేమిటి? ఎవరూ? ఇలా రాకూడదు ఆడాళ్లు నీళ్లోసుకుంటున్నారు' అంది. నరసింహం నాలుక కరచుకొని, అత్తగారనుకొని, 'క్షమించండి అత్తయ్యా, ఎవరూ లేరనుకున్నాను' అన్నాడు. పార్వతి నవ్వలేక చచ్చింది.

లాంగు సైట్ తో దగ్గిర కునుకులు కనపడక బాధపడుతున్నవాడు ఓమూల నోరు మూసుకు పడుంటే ఏ బాధా లేకపోను.. ఇక ఆ తలంటులో చెప్పాలి భాగోతం! వేణ్ణీళ్ల కాగులో చెయ్యి పెట్టి, అమ్మ నే నా తలంచుకోకుండా తేలు కుట్టిన దొంగలా ఊరుకున్నాడు. 'షీకాయ కళ్లల్లో పడుతోంది సరిగ్గా రుద్దవే కామాక్షీ!' అన్నాడు. నిజానికి కామాక్షి ఆవేళకు తల రుద్దడమే లేదు, ప్రక్కనే చిన్నతమ్ముడికి నలుగు పెడ్తోంది. అందరూ ఘొల్లున నవ్వేరు. నరసింహానికి పట్టరాని కోపంవచ్చి లేచిపోయి, 'ఏమిటా వెకిలినవ్వులు, చాలు అయిన మర్యాదలు' అని ఎలాగో వెళ్లి గదిలో పడ్డాడు. అత్తగారిచే అరగంట బతిమాలించుకొని, ఎలాగో భోజనానికి లేచాడు. భోజనాలయిన తరువాత మామగారు 'ఎలావుంది నాయనా వంట?' అని అడుగుతే 'చాలా బాగుంది, కూర మరీ రుచిగా వుంది' అన్నాడు. నిజానికి ఆవాళ పాపోశిన్తే గాని కూర వండనే లేదు! మామగారు తెల్లబోయారు!

బావ గుడ్డివాడని పోల్చి ఆ యింటివారంతా అతనికి తాటాకులు కట్టేరు. 'ఇక నసేమిరా ఉండను. సంక్రాంతినాడే వెళ్లిపోతానని మొండి పట్టు పట్టేడు నరసింహం.

ఎవరెంత చెప్పినా వినలేదు. అక్కడికీ కొంచెం తెలివివున్నవాడు కనుక 'ఏమిటో నా వంట్లో బాగులేదు, కళ్లు తిరుగుతున్నట్లున్నాయి. ఎవరేనా కాస్త స్టేషనుకు దిగబెట్టండి' అని బతిమాలుకొన్నాడు. మామగారు పెద్దకొడుకు సత్యాన్నిచ్చి పంపించాడు. ఎలాగో స్టేషను చేరుకున్నారు. ఏదో కూసింది. 'అదిగో మెయిలు' అన్నాడు నరసింహం. సత్యం 'మెయిల్ కాదు బావా గూడ్సు' అన్నాడు నవ్వాపుకుంటూ. మెయిల్ రాగానే నరసింహం ఓపెట్టెలో ఎక్కబోయాడు. 'అయ్యో! ఇది సర్వెంట్సు కంపార్టుమెంటు దిగుబావా' అన్నాడు సత్యం. ఆఖరికి సత్యమే ఎలాగో రైల్లో ఎక్కించి, 'ఆ మూల ఖాళీగావుంది కూర్చో బావా' అన్నాడు. నరసింహం ఆ మూలకు వెళ్లి నిద్రపోతున్న ఓ ఆంగ్లో యిండియన్ లేడీ వళ్లో కూర్చున్నాడు. ఆమె లేచి నానాతిట్లు తిట్టింది. 'మీరవసవరంగా ఆగ్రహం పడకండమ్మా. ఆయనకు వంట్లో బాగు లేక కళ్లు తిరుగుతున్నాయట' అని సత్యం సర్ది చెప్పి ఎరిగున్న ఒకాయనతో 'కాస్తయీయాయన్ని బెజవాడలో దింపండి' అన్నాడు. 'నేను క్షేమంగా చేరానని మీ అక్కయ్యతో చెప్పు సత్యం' అన్నాడు నరసింహం.

'అలాగే, కలిసి ఉత్తరం రాద్దురుగాని' అన్నాడు సత్యం.

'అయ్యో! అదేమిటి?' అన్నాడు నరసింహం ఆశ్చర్యంతో.

'మా అక్కయ్య మీతో కూడా వస్తూనేవుంది. పక్క పెట్లో సామానులతో వుంది. దీపావళికి రా బావా' అన్నాడు సత్యం.

'మళ్లీనా, కళ్ళజోడు, కాదు, ఒకటి చెడ్డా మరొకటి. రెండు కళ్ళజోళ్ళుంటేనే' అనుకుంటూ పరధ్యానంగా 'ఆఁ' అన్నాడు నరసింహం.